ప్రజాశక్తి

గురువారం 7 ఆగస్టు 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఆర్టీసీ బస్సుల్లో
మహిళలకు ఉచిత ప్రయాణం

- ఆగస్టు 15 నుంచి అమలు
- చేసేలా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం
- ఆటో కార్మికుల్లో పెరుగుతున్న ఆందోళన
- జిల్లాల పునర్విభజనపై కమిటీ నివేదిక కోరిన సిఎం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సూపర్ సిక్స్‌లో మరొకదానికి ఆమోదం ఇచ్చారు. ఆగస్టు 15 నుంచీ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ పెట్టిన తీర్మానానికి మంత్రివర్గం ఆమోదించింది. ఇందుకోసం ఆర్టీసీ అధికారులు బస్సుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విధివిధానాలు ఇంకా జిల్లా అధికారులకు అందాల్సి ఉంది. జిల్లా పరిధిలో కొన్ని ఎంపిక చేసిన బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందని సమాచారం. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ సౌకర్యం ఉంటుందని చెబుతున్నారు. ఆగస్టు 15 నుంచి అమలు చేసే ఈ కార్యక్రమాన్ని మంత్రులు లాంఛనంగా ప్రారంభించనున్నారు. దీన్ని పెద్దఎత్తున మహిళల్లో సానుకూలంగా తీసుకుపోవాలని సిఎం చంద్రబాబు మంత్రులను ఆదేశించారు. జిల్లాలో జనాభాలో 11,27,398 మంది మహిళలున్నారు. వీరంతా ఆర్టీసీ ▶ 2లో

హామీలే తప్ప..
ఆచరణేదీ..?

- చేనేతలకు ఇచ్చిన హామీలు నెరవేరని వైనం..
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కూటమి ప్రభుత్వం రాకతో చేనేతలకు స్వర్ణయుగం మొదలయ్యిందని, చతికిల పడిన చేనేత వృత్తిని తిరిగి అభివృద్ధి చేస్తామని, చేనేతల కష్టాలు, సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని గతేడాది చీరాల జాండ్రపేటలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్ సవిత హామీ ఇచ్చారు. చీరాలలో చేనేత పార్కు ఏర్పాటు చేస్తామని, ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్రారంభిస్తామని, నేతన్నల కోసం నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. 365 రోజుల పాటు చేనేతలకు పని కల్పిస్తామని, వారు నేసిన వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని, డిజైన్ల కోసం ప్రత్యేక శిక్షణలు ఇస్తామని పేర్కొన్నారు. కానీ జిల్లాలో ఇవేవీ ఆచరణలోకి రాలేదు.

గతేడాది చీరాలలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనాల్సి ఉంది. కానీ వాతావరణం అనుకూలించక విజయవాడలో జరిగిన చేనేత సదస్సులో పాల్గొన్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు నూలు రంగులు, రసాయనాలు మరియు చేనేత ఉత్పత్తులపై వేసిన జి.ఎస్.టి.ని రద్దు చేయించటానికి కృషి చేస్తానని, అలా చేయించలేని పక్షంలో జి.ఎస్.టి. రీయింబర్స్‌మెంట్ ఇస్తానని చెప్పారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు చేస్తానన్నారు. సంవత్సర కాలం అనంతరం మరలా చేనేత దినోత్సవం వచ్చిన సందర్భంగా కొన్ని హామీలపై నిర్ణయం తీసుకున్నట్లు గత మంగళవారం చెప్పారే తప్ప వాటి అమలుపై విధివిధానాలపై స్పష్టత లేకుండా పోయింది. నేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని, చేనేత కార్మికుల కోసం రూ.5 కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు, చేనేత వస్త్రాలపై జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందని మరోసారి చెప్పారు.

కాగా చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు విషయమై మార్చి 26న రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 83 వేల మంది చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నట్లు ఈ జీవోలో ప్రకటించారు. ఈ మేరకు బాపట్ల ▶ 2లో

'కొండపి' సర్పంచి..
ఏకగ్రీవ ప్రక్రియ అప్రజాస్వామికం

3లో

అప్పుల బాధ భరించలేక..

చిన్నగుడిపాడులో కౌలురైతు ఆత్మహత్య

ఉరేసుకున్న కౌలు రైతు శివ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అప్పుల బాధ భరించలేక చెట్టుకు ఉరేసుకొని కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కౌలు రైతు నాలి శివ(28) బుధవారం ఆ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నాలి శివ గత పది సంవత్సరాలుగా వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. తనకున్న మూడు ఎకరాల సొంత పొలంతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసుకుంటున్నాడు. వాతావరణ అననుకూల పరిస్థితుల నేపథ్యంలో గత కొంతకాలంగా పంటలు సరిగా పండక పెట్టిన పెట్టుబడులు తీరక అప్పులు పెరిగిపోయాయి. గతేడాది కూడా ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి, మిరప పంటలను సాగు చేశాడు. అయితే పంటలు సరిగా పండక పోవడం, వచ్చిన దిగుబడికి ▶ 2లో

హామీలే తప్ప ఆచరణేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో 5,885 మంది చేనేతలు ఈ ఉచిత పథకానికి అర్హులుగా ఉన్నట్లు చేనేత జౌళి శాఖ అధికారులు నివేదిక పంపారు. కానీ నేటికి ఉచిత విద్యుత్ అందుబాటులోకి రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల మందికి పైనే నేత నేస్తున్న చేనేత కార్మికులున్నారు. వీరికి అనుబంధంగా నూలు రంగులు అద్దేవారు, చిలపలు వడికేవారు, ఆసు తోడేవారు, పడుగులు చేసేవారు, అచ్చులు కట్టే, చేనేత అనుబంధ వృత్తులు చేసేవారు సుమారు 70 వేల మంది వరకు ఉంటారు. మొత్తంగా 2.70 లక్షల మందికి గానూ ప్రభుత్వం 83 వేల మందికి మాత్రమే ఉచిత విద్యుత్తు పథకాన్ని ప్రకటించటం జరిగింది. అది కూడా అమలులోకి రాలేదు. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు యార్న్‌సబ్సిడీ, మార్కెటింగ్ డెవలప్‌మెంట్ అస్యూరెన్స్ (ఎం.ఓ.ఎ.), పావలా వడ్డీ తదితర రాయితీలను, రిబేటు బకాయిలను ప్రభుత్వాలు ఇస్తుండేవి. గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలోనే 2018 నుండి ఆపివేశారు. మొత్తంగా రూ 156 కోట్లు వుండే ఈ రాయితీ బకాయిలను వై.సి.పి. ప్రభుత్వం నిలిపి వేయగా, కూటమి ప్రభుత్వం కూడా ప్రకటించి కూడా నేటికీ విడుదల చేయలేదు. సహకార సంఘాలకు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు వరకు నిలిచిపోవటంతో పాటు, ఆఫ్కో నుండి రావలసిన బకాయిలు కూడా రాక సహకార సంఘాల పరిస్థితి అగమ్యగోచరం అయ్యింది. ఇక చేనేత కార్మికుల త్రిఫ్ట్ ఫండ్ కంట్రిబ్యూషన్ రూ.5 కోట్లు మంజూరు చేశామని చెబుతున్నారే కానీ అదేమీ చేనేతలకు చేరలేదు.

చేనేతపై జిఎస్‌టిని వెంటనే ఎత్తివేయించాలి
మురుగుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం

రాష్ట్రంలో చేనేత పరిశ్రమను బతికించాలనే ఉద్దేశ్యం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే కేంద్రంతో మాట్లాడి చేనేతపై వేసిన జిఎస్‌టిని ఎత్తివేయించాలి. చేనేత కార్మికులు, చేనేత అనుబంధ వృత్తులు చేస్తున్న వారందరికీ 200 యూనిట్‌లు ఉచిత విద్యుత్‌ను అమలుచేయాలి. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు రావలసిన రాయితీ బకాయిలు రూ.156 కోట్లు వెంటనే విడుదల చేయాలి. చేనేత సహకార సంఘాలకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు గత సంవత్సరం ఆగష్టు 7న జరిగిన చేనేత సదస్సులో ఇచ్చిన హామీలను అమలుచేసి చేనేత పరిశ్రమ రక్షణకు, చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అర్హులు. మరో వారం రోజుల్లో ఉచితంగా ప్రయాణం చేయనున్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు వైద్యం, కుటుంబ అవసరాల కోసం కొనుగోళ్లకు నిత్యం పట్టణాలకు వస్తుంటారు. బస్సుల్లో 30 శాతం మంది వరకూ మహిళలు ప్రయాణిస్తుంటారు. ఇప్పుడు ఆ సంఖ్య ఏమైనా పెరుగుతుందా? అనేదీ చూడాలి. ఇక ఆర్టీసీ బస్సుల్లో ఉచితం వల్ల ఆటోలు ఎక్కడం దాదాపుగా తగ్గనుంది. మండల కేంద్రాల నుంచి సమీపం లోని పట్టణాలకు ఎక్కువ శాతం మంది ఇప్పుడు ఆటోల్లోనే వస్తున్నారు. ఎందుకంటే బస్సులు ఎక్కువగా లేవు. అనుకున్నప్పుడల్లా అందుబాటులో లేవు. దీంతో గ్రామాల నుంచీ పది మంది చేరగానే ఆటోలు బయలుదేరతాయి. పట్టణాలకు ఇప్పుడు ఆటోలే కీలకంగా మారాయి. బస్సులున్న రూట్లలో ఆటోలకు గిరాకీ తగ్గనుంది. ఆటో కార్మికుల్లో ఆందోళన మొదలైంది. జిల్లాలో సిటీబస్సులు లేనందున ఆటో కార్మికులకు నష్టం తక్కువగానే ఉంటుంది. పైగా గ్రామాలనుంచి అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులేవు. ఒంగోలు, మార్కాపురం వంటి పట్టణాల్లో ఆటో కార్మికులకు ఎటువంటి నష్టం లేదు. బస్సులున్న రూట్లలో నడిచే ఆటోలకు నష్టం తప్పదు. ఇక జిల్లాకు సంబంధించి అంశాన్ని చూస్తే కొత్త జిల్లాల పేర్లు మార్పులు, విలీనాలపై వేసిన మంత్రుల కమిటీని వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని సిఎం చంద్రబాబు సమావేశంలో కోరారు. ఈ నివేదికలో మార్కాపురం జిల్లాతో పాటు ప్రకాశం జిల్లాలో అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు విలీనం కానున్నాయి. దీనిపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ జిల్లాలో పర్యటిస్తుందా? లేదా? అన్నదీ స్పష్టత లేదు. ఇక క్షౌరశాలలకు 200 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చేందుకు మంత్రివర్గంలో ఆమోదించారు.

తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి మేలు

యండ్రపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ దృశ్యం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం పుల్లలచెరువు మండలంలోని యండ్రపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడీఎస్ సూపర్ వైజర్ కెవి సుబ్బమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలలో శిశువు ఆరోగ్యానికి అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయి. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలివ్వడం వల్ల శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే తల్లికి కూడా కొన్ని రకాల క్యాన్సర్లు నివారించబడతాయి. తల్లి పాలు సమృద్ధిగా ఉండాలంటే తగిన ఆహారం తీసుకోవాలని వివరించారు. తల్లి పాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండాలంటే తగిన ఆరోగ్య సమాచారం అవసరమని తెలిపారు. తల్లిపాలు శిశువును సురక్షితంగా పెంచుతాయని, ఇది ప్రకృతిచ్చిన అమూల్యమైన బహుమతిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి రాజు, ఏఎన్ఎం వీరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షాహీదా, సార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గురవయ్య, గౌరి, హోమియో వైద్యులు డాక్టర్ యాకోబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: దోర్నాల మండలం తిమ్మాపురం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ మూడు సెంటర్లో అంగన్‌వాడీ కార్యకర్తలు జి సువాసిని, దొడ్డ రామలక్ష్మి కుమారి, కోడి రాణి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు తాపాలన్నారు. ఈ ముర్రుపాలు రోగనిరోధక శక్తిని బిడ్డకు అందిస్తుందని, బిడ్డపై తల్లికి ప్రేమ పెరుగుతుందని చెప్పారు. బాలింతలు, గర్భిణులు కచ్చితంగా ఆకుకూరలు, కాయగూరలు తగినంత మోతాదులో ఆహారంగా తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, ఏఎన్ఎం వాలీబాయి, హెల్త్ వర్కర్ వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ మహిళ పోలీస్ అనంతలక్ష్మి, బాలింతలు, గర్భిణులు, ప్రజలు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: మండలంలోని ఎం వేములపాడు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో వేములపాడు సెక్టార్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఆర్ పార్వతీబాయి అధ్యక్షత వహించారు. తల్లిపాలు బిడ్డకు టీకా లాంటిదని పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లులు ముర్రుపాలు తాపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈర్ల విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ మండవ సులోచన, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, కల్పన, సుశీల, సుజాత, రమ, జిఎంఎస్ కె రాధామాధవి, వైద్యారోగ్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

చిలకపాడులో..

మండలంలోని చిలకపాడు ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంనందు తల్లి పాల వారోత్సవాల వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతీబాయి ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాలు బిడ్డలకు ఎంతో శ్రేష్టమని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తల్లులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

శ్రీను మాస్టర్ సేవలు వెలకట్టలేనివి

సాయం అందజేస్తున్న శ్రీను

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న దోర్నాల పాఠశాల హిందీ ఉపాధ్యాయులు శ్రీని వాసులు సేవలు వెలకట్ట లేనివని పలువురు పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో తను పని చేస్తున్న పాఠశాలలో వసతుల కల్పనకు దాతల సహకారమే గాక తన సొంత నిధులు కూడా వెచ్చించారు. పాఠశాలకు 5 కిమీ దూరంలో ఉన్న బయన్నస్వామి గూడెం నుంచి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్చుకొని వారికి ఆర్డీటీ సహకారంతో ఆటో సౌకర్యం కల్పించారు. ఈ విద్యా సంవత్సరం ఆర్డీటీకి కేంద్రం నిధులు నిలిపివేయడంతో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తన సొంత నిధులు ప్రతి నెల ఆటో వారికి అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ ఆయనను ప్రశంసిస్తూ తాము కూడా సహాయం చేస్తామని చెప్పడం విశేషం.

10వ తరగతి సర్టిఫికెట్ పోయినది

పెద్దారవీడు మండలంలోని బద్వీడు గ్రామానికి చెందిన కంచర్ల సుబ్బయ్య, తండ్రి:బాల కేశయ్య నకు చెందిన 10వ తరగతి (మార్కుల జాబితా) ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది. జిరాక్స్ తీయించుకునేందుకు వస్తుండగా మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో జారిపోయినది. సర్టిఫికెట్ నెం: 1516653690. ఎవరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు.

కంచర్ల సుబ్బయ్య,
సెల్: **9014909623.**

డాక్యుమెంట్ పోయినది

పగడాల వెంకటేశ్వరరెడ్డి, తండ్రి చినకొండారెడ్డి నేను ప్రస్తుతం ప్రకాశం జిల్లా కనిగిరిలో నివాసం వుంటున్నాను. నా ఆస్తికి సంబంధించిన ఒంగోలు SROలో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన **దస్తావేజు నెం. 550/1981ను** జిరాక్స్ తీసుకొనుటకుగాను పోవుచుండగా ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో పోయినవి. కావున ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనను దొరికిన యెడల మా చిరునామాకు గాని లేదా క్రింది ఫోన్ నెంబర్‌కు గాని తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు... **పగడాల వెంకటేశ్వరరెడ్డి, తండ్రి చినకొండా రెడ్డి**
కనిగిరి, ప్రకాశం జిల్లా. సెల్ : 9618610739

పీఎం ఫసల్ బీమా గడువు పొడిగింపు: ఏవో

ప్రజాశక్తి-పొదిలి

ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో పంటల బీమాకు తుది గడువును 31 జూలై నుంచి 14 ఆగస్టు 2025 వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని మల్లవరం, అక్కచెరువు గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్-2025లో వేసిన పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. పంటల బీమాకు సంబంధించి గడువును ప్రభుత్వం పొడిగించినందున రైతులు సేవా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి భూమి వివరాలు, ఆన్‌లైన్, సాగు ధ్రువీకరణ పత్రంలో నమోదు చేయించుకొని ఆ తరువాత రైతు వాటాగా కంది పంటకు ఎకరాకు రూ.430, సజ్జకు రూ.156, వరి పంటకు రూ.860, మిరపకు రూ.4,500, చెల్లించి కామన్ సర్వీస్ సెంటర్స్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. కౌలుకు సాగు చేసుకునే ప్రతి రైతు కూడా తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రాలు తీసుకోవాలని, ఇవి గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి పొందాలన్నారు. కౌలు కార్డు వల్ల ఈ-పంట నమోదు, అతివృష్టి, అనావృష్టి సమయంలో పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్, పండించిన పంటలను మద్దతు ధరకు అమ్ముకోవడానికి, సబ్సిడీ ద్వారా విత్తనాలు పొందడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గురుబ్రహ్మం, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి-అర్ధవీడు: సరైన పత్రాలు లేకుండా ఎరువులు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎరువులు పురుగు మందుల తనిఖీ అధికారి షేక్ అబ్దుల్ రఫీక్ తెలిపారు, అర్ధవీడు మండలంలోని అర్ధవీడు, పాపినేనిపల్లి గ్రామాలలో ఎరువులు, పురుగు మందుల షాపులపై బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిల్వల రిజిస్టరు, బిల్ పుస్తకాలు, ఇన్వాయిసులు, లైసెన్సులను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులు సరైన పత్రాలు లేకపోవడంతో రూ.2,50,767 విలువైన అమ్మకాలు నిలిపివేసినట్లు తెలిపారు. ఎరువులు పురుగు మందులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని డీలర్లకు తెలియజేశారు. అధిక ధరలకు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అప్పుల బాధ భరించలేక..

(మొదటిపేజీ తరువాయి)

కూడా సరైన ధర లేకపోవడంతో పెట్టుబడుల రూపంలో అప్పులే మిగిలాయి. ఇలా మొత్తం రూ.25 లక్షలు పంటల పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. ఈ ఏడాది కూడా మూడు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసి మిగతా కౌలుకు తీసుకున్న ఏడు ఎకరాలను మిర్చి పంట వేసేందుకు సిద్ధం చేసి ఉంచాడు. అయితే సకాలంలో వర్షాలు కురవకపోవడం, కాలం కలిసి రాకపోవడంతో ఈ ఏడాది కూడా నష్టాలు తప్పవని భావించాడు. దీనికి తోడు ఈ పాటికే సాగు చేసిన పత్తి పంటకు పేనుబంక, ఎర్రతెగులు సోకాయి. ఈ నేపథ్యంలో.. అప్పులిచ్చిన వారు తమ అప్పులు తీర్చండి అంటూ ఒత్తిడి చేయడం ప్రారంభించారు. దీంతో అప్పులు తీర్చేందుకు ఏ మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురై ఊరి బయట ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

In the Court of the 1st Addl. Civil Judge (Junior Division), Ongole.
I.A. NOs.48 & 49/2024
in
O.S.No.244/2017.

బండి సునీత ....వాది
AND
శంక నాగరాజ కుమారి & వగైరాలు .....ప్రతివాదులు

To:
శంక నాగరాజ కుమారి W/o శంక శ్రీనివాసరావు, వయసు 62 సం, Plot No.301, బంగారు రెడ్డి హెూమ్స్, Opp. ఒంగోలు పబ్లిక్ స్కూల్, మంగమూరు డొంక, ఒంగోలు.

బండి సునీత అను వారు O.S.No.244/2017 దావాను, శంక నాగరాజ కుమారి & వగైరాలు మీద ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఒంగోలు వారి కోర్టులోలో దాఖలు చేసిఉన్నారు. దాని నిమిత్తమై కోర్టువారు I.A.No.48/2024 & I.A.No.49/2024 లలో ఉత్తర్వులు మీకు అనేక పర్యాయములు పంపినప్పటికీ జారీకానందున పై కోర్టువారు వారి ఉత్తర్వుల ప్రకారం 20-08-2025 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా కాని మీ వకీలు ద్వారా కానీ పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని ఈపత్రిక ముఖముగా మీకు తెలియజేయడమైనది.

ఇట్లు
NARAYANA GOPAVARAPU
ADVOCATE FOR PETTIONER /PLAINTIFF, ONGOLE
Cell : 9676942817

కోర్టు వారి సమనులు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, అద్దంకి
O.S. No: 178/2024

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పంగులూరు బ్రాంచ్ తరుపున మేనేజర్ గారు ...... వాది
మరియు
డేరంగుల నాగేంద్ర బాబు .... ప్రతివాది

To
1.డేరంగుల నాగేంద్ర బాబు, తండ్రి ఆంజనేయులు, డోర్ నెంబర్ 2-150, కోటపాడు గ్రామము, జె. పంగులూరు మండలం, బాపట్ల జిల్లా

పై దావాలోని ప్రతివాది అయిన మీపై, వాది అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పంగులూరు బ్రాంచ్ వారు తమబాకి రాబట్టుకోనుటకు, మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో O.S.No.178/2024 దావా వేయగా, ప్రతివాది అయిన మీకు అనేక పర్యాయములు దావా సమన్లు పంపినను తీసుకోన కుండా కాలయాపన చేయుచున్నదున కోర్టువారు మీకు ఈపేపరు ప్రకటన ద్వారా మీకు సమన్లు జారిచేయమని ఉత్తర్యులు ఇచ్చియున్నారు. కావున తేది:19-08-2025న ఉదయం గం 10:30 ని:లకు మీరు స్వయంగా గానీ లేక, మీ తరుపున న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలియజేసుకోనవలయును. లేని యడల సదరు దావాను మీపరోక్షమున విచారించి తీర్మానించ బడునని తెలియజేయదమైనది.

వాయిదా తేది : 19-08-2025
అద్దంకి
తేది: 06-08-2025 ఇట్లు
నాదెండ్ల దశరథరామయ్య
వాది తరుపు అద్వకేట్
సెల్ నెం :9701488099

బెల్టుషాపులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమి

మాట్లాడుతున్న సయ్యద్ షమి

ప్రజాశక్తి -పామూరు

బెల్టుషాపులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమి ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా 8వ మండల మహాసభ కె.భానుమతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షమీ మాట్లాడుతూ వైసిపి సీసాలో కూటమి మద్యం ఏరులైపారుతుందన్నారు. రాజకీయ నాయకులు అండతో గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటున్నట్లు తెలిపారు. వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మహిళల సమస్యలను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపు నిచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా నాయకురాలు ఉసా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఐక్యమైతేనే దేనినైనా సాధించగలమని తెలిపారు. ఉపాధి హామీ పనులు నిలుపుదల చేయడంతో మహిళలకు కుటుంబాన్ని నిర్వహించడం కష్టంగా ఉందన్నారు. ఉపాధి లేక యువత ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధారమ్మ, ఖాదరున్నీషా పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభ అనంతరం నూతన కమిటీని ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా షేక్ మస్తానమ్మ, కార్యదర్శిగా కొమ్మలపాటి ధనలక్ష్మి, ఉపాధ్యక్షులుగా షేక్ మదరమ్మ, సహాయ కార్యదర్శిగా భానుమతి,ట్రెజరర్‌గా ఖాదరున్నీషా ఎన్నికయ్యారు.

షేక్ మస్తానమ్మ

కొమ్మలపాటి ధనలక్ష్మి

వీల్ చైర్స్ అందజేస్తున్న ఎంఇఒలు

వీల్‌చైర్స్ అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

ఎస్ఎస్‌సి కాలనీ లోని భవిత సెంటర్‌లో వికలాంగ విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారులు డివిఎల్ నరసింహారావు, కె.శివాజీ చేతుల మీదుగా వీల్ చైర్స్ మరియు సిపి చైర్స్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష శాఖ ద్వారా సరఫరా చేసిన వీల్ చైర్స్, సిపి చైర్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌టిలు సుధాకర్ బాబు,మల్లేశ్వరి, ఉపాధ్యాయుడు యాకోబ్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిసిపల్లి: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల , గోపవరపు వారి పల్లి భవితా కేంద్రంలోని వికలాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష వారు అందజేసిన వీల్‌చైర్స్ పంపిణీ చేసినట్లు ఐఇడి టీచర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు సంజీవి , శ్రీనివాసులు నాయుడు, ఐఇ ఆర్‌పిలు, శేషిక, ఉపాధ్యాయులు గురువారెడ్డి పాల్గొన్నారు.

ఇన్వర్టర్ అందజేస్తున్న కొండవీటి ఏడుకొండలు

ఇన్వర్టర్ బహూకరణ

ప్రజాశక్తి - చీమకుర్తి

చీమకుర్తి తహశీల్దారు కార్యాలయానికి గెలాక్సీ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండవీటి ఏడుకొండలు బుధవారం ఇన్వర్టర్ బహూకరించారు. అందజేశారు. తహశీల్దారు బ్రహ్మయ్యకు ఇన్వెర్టర్ అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు ఆర్.బ్రహ్మయ్య దాత గెలాక్సీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏడుకొండలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కందిమళ్ల గంగాధర్ రావు, గెలాక్సీ లైన్స్ క్లబ్ కార్యదర్శి బొడ్డు ఆంజనేయులు, కోశాధికారి ఆలపాటి నరసింహారావు, నాయకులు మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, బొడ్డు శ్రీను, బొడ్డు అవినాష్, బి.హరిబాబు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఎంఇఒ టి. పద్మావతి తెలిపారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోని ఎస్‌సి కాలనీ మోడల్ స్కూల్ విద్యార్థులకు పలకలు, రాత పుస్తకాలు బుధవారం అందజేశారు. కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు చెక్కా కోటేశ్వరరావు తమ సొంత నిధులతో పలకలు, రాత పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ గతంలోనూ పదవ తరగతి పరీక్షల సమయంలో కొత్తపట్నం హైస్కూల్ విద్యార్థులకు కోటేశ్వరరావు పరీక్ష సామగ్రి అందజేసినట్లు తెలిపారు. కోటేశ్వరరావు గిసిన అంబేద్కర్, పొట్టి శ్రీరాములు బొమ్మలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. దాత చెక్కా కోటేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరు పాఠశాలలో పనిచేస్తున్న కొప్పోలు హనుమంతరావు మాస్టారు కోరిక మేరకు పిల్లలకు పలకలు పంపిణీ చేశామన్నారు. నవోదయ స్కూల్ సీటు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1116 రూపాయల వంతున నగదు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కనిగిరిలో ఈనెల 12,13 తేదీల్లో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 17వ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రమైన హనుమంతునిపాడులో బుధవారం కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 1993లో అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో కష్టజీవుల హక్కుల కోసం సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటికీ దేశంలో 65 శాతం ప్రజలు వ్యవసాయ రంగం మీదే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా కోటి మంది సభ్యులతో విస్తరించి ఉన్న వ్యవసాయ కార్మిక సంఘం పేదలకు ప్రభుత్వ భూములు పంచాలని, అర్హులకు పక్కా గృహాలు, ఇంటి స్థలాలు ఇవ్వాలని అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేసే చర్యలు ఉన్న నిలువరించాలని పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనేక సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఇలాంటి ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను ప్రజా సమస్యలపై పోరాటాలను ఈ మహాసభ రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే దుర్మార్గపు చర్యలను విరమించుకోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటకు తీసుకురావాలన్నారు. రైతు కూలీల సమస్యల కోసం, వ్యవసాయ రంగం పరిరక్షణ కోసం, గ్రామీణ ప్రజల జీవన విధానాలు మెరుగు కోసం మెరుగైన ఉపాధి పని దినాలు పెంపు, కనీస వేతనాలు అమలు కోసం ఈ మహాసభలు దోహదపడతాయని తెలిపారు . కనిగిరిలో 12వ ఉదయం 10 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభమవు తుందన్నారు. మధ్యాహ్న భోజన అనంతరం ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి

ప్రజా వ్యతిరేక విధానాలను

ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి -కనిగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం కనిగిరి పట్టణ జనరల్ బాడీ సమావేశం పిపి.కేశవరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కలిగించేలా వ్యవహరిస్తూ ప్రజలకు నష్టం జరిగేలా చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు చూడటం దారుణమన్నారు. ప్రజల సమస్యలను పాలకులు పట్టించు కోకుండా గొప్పలు చెప్పు కునేలా ప్రచార ఆర్భాటాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12,13 తేదీల్లో కనిగిరిలో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఏడుకొండలు, నరేంద్ర, వెంకటమ్మ, శాంత కుమారి, ప్రసన్న, ఓబయ్య, యు.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

తరుచూ ముంపునకు గురవు తున్న చిన్నగంజాం రెవెన్యూ పరిధిలోని ఉప్పుగుండూరు రైతుల పొలాలకు మహర్దశ కలుగుతుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు ఎమిలేరు కాలువపై రూ.69.90 లక్షలతో నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ సొరంగ మార్గం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలుస్తుందన్నారు. ఎమిలేరు కాలువ పరిధిలోని రైతుల పడుతున్న కష్టాలు తమదృష్టికి రావడంతో ఆ కష్టాలను తొలగించ చడానికి 18.400 కిలోమీటరు వద్ద (సాయిబాబా స్థూపం వద్ద) రూ. 69.90 లక్షలతో ఎమిలేరు కాలువ అడ్డంగా సొరంగ మార్గం నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు తద్వారా పొలాలు ముంపునకు రైతుల కష్టాలు తీరతాయన్నారు అనంతరం కొమ్మమూరి కాలువ నుంచి వచ్చే కాలువను పరిశీలించారు ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు పొద వీరయ్య, డైరెక్టర్ జాగర్లమూడి సాయిప్రసాదు, కనగాల శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాసరావు, మాగులూరి సత్యనారాయణ, నల్లూరి బాబూరావు, టి.శ్రీరాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సుధాకర్ , నీటిపారుదల శాఖ డిఇఇ ఎన్‌కెవి ప్రసాదరావు ఎఇలు శ్రీనివాసరావు , శ్రీధర్ ,నీలిమ, కాంట్రాక్టరు బొల్లేపల్లి ఆదినారాయణ, తూమాటి శ్రీనివాస రావు, తూమాటి ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

హాకీ జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలు

హాకీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల

ఈనెల 29న జాతీయక్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ బాలుర, బాలికల జిల్లా టీంను మండలంలోని చెరువు జమ్ములపాలెం జెడ్‌పి హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఎంపిక చేశారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు గుంటూరులో జరిగే జోన్-3 పోటీల్లో పాల్గొంటారని డిఎస్‌డిఓ పాల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వివి కృష్ణారావు, సీనియర్ ఉపాధ్యాయులు విక్టోరియమ్మ, బాపట్ల హాకీ కోచ్ వెంకట్, పిడి వీరచంద్ర, ఉపాధ్యాయులు, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న జెసి గంగాధరగౌడ్

ఈదుపల్లిలో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - నగరం

ఈదుపల్లిలో ప్రబలుతున్న విషజ్వరాల నేపథ్యంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధర గౌడ్ నేతృత్వంలో అధికారులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఆరోగ్య పరిస్థితులు సమీక్షించారు. తాగునీరు, పారిశుద్ధ్య లోపాలే జ్వరాలు ప్రబలటానికి కారణాలుగా గుర్తించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా వాటర్ స్కీం ద్వారా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. అంతేకాక ఈదుపల్లి ఈదులమ్మ గుడి దగ్గర ఉన్న ట్యాంక్ వద్ద బోర్ ఉన్నా ఆ నీరు తాగటానికి పనికిరావడం లేదని గ్రామస్థులు తెలిపారు. గతంలో నిర్మించిన పంప్‌షెడ్ నుండి నీటిని పైప్‌లైన్ ద్వారా ట్యాంకుకు విడుదల చేయాలని అధికారులను కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యటనలో డీపీఓ ప్రభాకర్, తహశీల్దారు నాంచారయ్య, ఎంపిడిఒ బి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి కంపు

ప్రజాశక్తి - బల్లికురవ

ఉపాధి హామీ పనుల్లో ఇప్పటి వరకు జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.లక్షల్లో అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. ముక్తేశ్వరం పంచాయతీలో అవినీతి జరిగినట్లు గుర్తించారు. కొమ్మినేని వారిపాలెం, కొప్పెరపాలెం, వేమవరం పంచాయతీల్లో గతేడాది జరిగిన పనుల్లో ప్రతి పంచాయతీలో రూ.లక్షల్లో అవినీతి జరిగినట్లు గుర్తించారు. కనీవిని ఎరుగని రీతిలో మండలంలో ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరిగినట్లు ప్రజల్లో చర్చ జరుగుతుంది. ఒకే వర్క్ ఐడిపై రూ.8.80 లక్షల అవినీతి జరిగినట్లు గుర్తించారు. పెద్ద ఎత్తున అవినీతి జరగడానికి క్షేత్రస్థాయి సిబ్బందికి మండల స్థాయి అధికారులు సహకరించడంతో అవినీతి జరిగినట్లు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల పనులు జరగకుండానే జరిగినట్లుగా చూపించి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి రూ.లక్షలు దోపిడీ చేసినట్లు చర్చ జరుగుతుంది. ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరుతున్నారు. అవినీతికి కారకులైన వారిపై చర్యలు తీసుకొని వెంటనే రికవరీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రజలు లేకుండా జరుగుతున్న ప్రజా వేదిక నిలుపుదల చేయాలని, ప్రజల మధ్యలో ప్రజావేదిక నడిపించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కార్యదర్శి డి వీరయ్య పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీ ప్రమాదంపై కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - బల్లికురవ

గత ఆదివారం సత్య కృష్ణ క్వారీలో ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలను సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంవి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిహరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాలు దాటి పొట్ట చేత పట్టుకొని వచ్చిన కార్మికుల ప్రాణాలకు ఇక్కడ రక్షణ లేకుండా పోతుందని వాపోయారు. క్వారీల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ కార్మికుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై మైనింగ్, పోలీసు, కార్మిక శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసి చేతులు దులుపుకునే పరిస్థితి జరుగుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల నుండి కార్మికులను కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగిన ప్రభుత్వం పెద్దగా స్పందించకపోవడం, క్వారీల యాజమాన్యాలు సరిగా పట్టించుకోకపోవడం విచారించదగిన విషయమని అన్నారు. సాక్షాత్తు కలెక్టర్, ఎస్పీ చేసిన ప్రకటనలు అనుమానాలకు తావిస్తుందని అన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయపై బల్లికురలో కార్మిక సంఘాలతో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు భద్రత లేకపోవడంపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఎఐటియుసి, ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. 2024-25 విద్యా సంవత్సర 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండలంలోని ఈపురుపాలెంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉత్తమ మార్కులు సాధించిన కంచర్ల సైని, దాసరి తులసి, హిమబిందు, సుమేరా, దివ్యశ్రీ, శశికాంత్, క్రాంతి, మనోజ్‌కు నగదు పురస్కారాలు, మెమెంటోలు అందజేశారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లోనే కాకుండా మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే గురువుల బాధ్యతని అన్నారు. రిటైర్డ్ ఆర్అండ్‌బి ఎస్ఇ చేగూడి వెంకట సుబ్బయ్య దాతృత్వంతో బహుమతులు అందజేశారు. ఆయన సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో రాణించాలి

ప్రజాశక్తి - చీరాల

అవగాహన కల్పిస్తున్న సిఐ సుబ్బారావు, ఎస్ఐ హరిబాబు

మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి ప్రోగ్రాంలో భాగంగా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో మహిళా కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వన్ టౌన్ సిఐ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని అన్నారు. యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని చెప్పారు. వాటివల్ల ఆరోగ్యానికి, వ్యక్తిత్వానికి, కుటుంబానికి కలిగే నష్టాలు వివరించారు. వ్యక్తిగత హద్దులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అవసరమైన సమయంలో ఎవరిని సంప్రదించాలో చెప్పారు. శక్తి టీం ఎస్ఐ హరిబాబు మాట్లాడుతూ శక్తి యాప్, శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 వినియోగంపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఓఎస్ బటన్ వాడకాన్ని వివరించారు. మహిళలు తమ మొబైల్ ఫోన్లలో తప్పనిసరిగా శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనుచిత ప్రవర్తనలను తక్షణమే 100, 112 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. బస్టాండ్లు, రోడ్డులు, విద్యా సంస్థల వద్ద వేధింపులకు గురైతే వెంటనే శక్తి బృందాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శక్తి బృందం సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ప్రదర్శించారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, శక్తి బృంద సభ్యులు పాల్గొన్నారు.

మురుగునీటికి ఇంకుడు గుంతలే పరిష్కారం

ప్రజాశక్తి - బాపట్ల

సిబ్బందికి సూచనలు ఇస్తున్న శివలీల

గ్రామాల్లో ఇంటి ముందు మురుగు నీటి గుంటలు కాకుండా ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోని మురుగు నీటి సమస్య నివారించుకోవచ్చుని మండల ప్రత్యేక అధికారి, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివలీల సూచించారు. మండలంలోని తూర్పు బాపట్ల పంచాయతీలోని నందిరాజుతోటలో ఆమె పర్యటించారు. డెంగ్యూ, ఇతర విష జ్వరాల బారిన పడకుండా గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై పంచాయతీలు, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. మండలంలోని కొండు భొట్లవారిపాలెం, పిన్ని బోయిన వారిపాలెం, తూర్పు పిన్నిబోయి న వారిపాలెం, పడమర బాపట్ల, బేతపూడి, వెదుళ్ళ పల్లి, స్టువర్టుపురం గ్రామాలను సందర్శించారు. డెంగ్యూ, విషజ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట ఎంపిడిఓ బి.బాబురావు, డిప్యూటీ ఎంపిడిఓ జి రామకృష్ణ, తూర్పు బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు.

ముత్తుపల్లిలో ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఒకే వీధిలో నలుగురికి డెంగీ లక్షణాలు

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని ముత్తుపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం డోర్ టు డోర్ జ్వరం పరీక్షలు స్వీకరించారు. ఈ క్రమంలో జ్వరం ఎక్కువగా 14 మందిని గుర్తించారు. వారికి డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా నలుగురికి డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పి మేడిగ విజయ్ దీపక్ తెలిపారు. మెరుగుపాల నాంచారయ్య, మెరుగుపాల నాగమల్లేశ్వరి, మెరుగుపాల సునీత, కొక్కిలిగడ్డ శివయ్యకు డెంగ్యూ లక్షణాలు ఉన్నప్పటికీ ఎటువంటి ప్రాణహాని లేదని తెలిపారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు మాత్రమే ఉన్నట్లు తెలియడంతో వారిని వెంటనే నగరం సిహెచ్‌సికి తరలించారు. అవసరమైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారిని తమ గ్రామాలకు పంపించి ప్రతిరోజు పర్యవేక్షణలో ఉంచుతామని తెలిపారు. వారిలో మెరుగుపళ్ళ నాంచారయ్యకు 73ఏళ్ల వయస్సు కావడంతో ఆయన బంధువుల విజ్ఞప్తి మేరకు విజయవాడలోని హాస్పటల్‌కు తీసుకువెళ్లేందుకు అనుమతించామని అన్నారు. మెరుగుపళ్ళ నాంచారయ్యకు ప్లేట్లెట్స్ 90వేలు ఉండగా మిగిలిన పేషెంట్లకు రెండు లక్షలు ఉన్నాయని తెలిపారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బాపట్ల

డిఎంహెచ్ఓ విజయమ్మ

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో పాటు కాలానుగుణ వ్యాధులు విష జ్వరాల బారిన పడకుండా వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ .విజయమ్మ వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకుప్రజారోగ్యంపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించాలన్నారు. ఫ్రైడే డ్రై డే పాటిస్తూ, క్రమం తప్పకుండా గ్రామాల్లో పైపుల ద్వారా వచ్చే త్రాగు నీటిని ప్రతి రోజు పరీక్ష చేయించాలన్నారు. నీటి సరఫరా పైపులు పైపులు లీకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పైపులు లీకులు ఏర్పడితే త్రాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు అందించే వైద్య సేవలను ప్రచారం నిర్వహించాలన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని

చెరుకుపల్లి : ప్రస్తుతం విజృంభిస్తున్న డెంగ్యూ, సీజనల్ జ్వరాల పట్ల అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఎంపిడిఓ షేక్ మహబూబ్ సుభాని ఆదేశించారు. సీజనవ్యాధుల పట్ల స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది నిరంతరం గ్రామాల్లో పర్యటించి అనుమానం ఉన్న చోట్ల పరీక్షలు చేయాలని ఆదేశించారు. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకుని వైద్యం పొందాలని తెలిపారు. దోమల నివారణకు బ్లీచింగ్, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని ఆదేశించారు. దోమల నిర్మూలనకు ఆయిల్ బాల్స్, సున్నం, బ్లీచింగ్ చల్లాలని తెలిపారు.

ప్రజాశక్తి
గురువారం 7 ఆగష్టు 2025

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంస్థ సభ్యులు

మహాప్రస్థానంలో శాంతి రథం ఉంచే అవకాశమివ్వాలి

కమిషనర్‌కు విన్నవించిన మానవత సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఒంగోలు శాఖ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సంబంధించిన ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథం ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న మహాప్రస్థానంలో ఉంచే అవకాశం ఇవ్వాలని సంస్థ సభ్యులు ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును కోరారు. సభ్యులు బుధవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు గత సంవత్సర కాలంగా ఒంగోలులో సంస్థ చేసిన కార్యక్రమాలు, సభ్యులుగా చేరిన వారు ఇచ్చే విరాళాలతో చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. సంస్థ సేవల పట్ల కమిషనర్ సంతప్తిని వ్యక్తం చేస్తూ సంస్థలో గౌరవ సభ్యులుగా సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ఛైర్మన్ మంగళగిరి నరసింహారావు, అధ్యక్షులు పి.శరభలింగాచారి, ప్రధాన కార్యదర్శి డి. చంద్రశేఖర్, కన్వీనర్ పి. రామసుబ్బారెడ్డి, కోశాధికారి ఎం.భోగి రెడ్డి, డైరెక్టర్లు వడ్డేంపూడి సుజాత రావు, కోసూరి శ్రీదేవి, దన్నారపు మస్తాన్ రావు, చెరుకూరి ఆదిలక్ష్మి, సంపూర్ణ, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

చుండూరు బాధితులకు అందని న్యాయం

దళిత నేత నీలం నాగేంద్రరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చుండూరు దళిత నరమేధంలో పెత్తందారీ హంతకులు అందరూ నిర్దోషులైతే మరి హంతకులు ఎవరని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ప్రశ్నించారు. చుండూరు నరమేధం జరిగి 34 సంవత్సరాలైన బాధితులకు నేటికీ న్యాయం జరగలేదన్నారు. బుధవారం స్థానిక సమితి కార్యాలయంలో నీలం నాగేంద్ర రావు మాట్లాడుతూ అప్పటి గుంటూరు జిల్లా చుండూరులో విద్యావంతులు ఉద్యోగస్తులు అధికంగా నివసించే చుండూరు మాలపల్లిపై చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పెత్తందారీ హంతక ముఠా పోలీసుల సాయంతో మారణకాండ సృష్టించి 8 మందిని ఊచకోత కోశారన్నారు. చుండూరు దళిత ఉద్యమం సామాజిక సాంఘిక సాంస్కృతిక ఉద్యమాలకు జన్మనిచ్చిందన్నారు. చుండూరు దళితుల రక్తపు ధారలే జాతీయ ఉద్యమంగా మారి దేశవ్యాప్త దళిత ఉద్యమాలకు చుండూరు దిక్సూచిగా నిలిచిందన్నారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి, పిల్లి మాల్యాద్రి, దేవరపల్లి గోపి, గోపాల్, బంగారం, ఎర్రమోతు నారాయణ పాల్గొన్నారు.

'లేఅవుట్ల క్రమబద్ధీకరణ'ను ఉపయోగించుకోండి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అనధికారిక లేఅవుట్లు, లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఒంగోలు పట్టణాభివద్ధి సంస్థ(ఒడా) ఉపాధ్యక్షులు ఆర్.గోపాలకష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. 2025 జూన్ 30వ తేదీ లోపు రిజిస్టర్ కాబడిన లేఅవుట్లు మరియు ప్లాట్లకు ఈ క్రమబద్ధీకరణ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. అనధికార లేఅవుట్లు, ప్లాటు కలిగిన వారు, లేఅవుట్లను అభివద్ధి చేసిన అభివద్ధి దారులు, గతంలోని ఎల్ఆర్ఎస్-2020లో దరఖాస్తు చేయనివారు ఇందుకు అర్హులని తెలియజేశారు. దరఖాస్తు చేయదలచిన వారు 2025 జూలై 27 నుండి 90 రోజుల లోపు యల్ఆర్ఎస్ అధికారిక పోర్టల్‌లో దరఖాస్తు చేయాలన్నారు. పోర్టల్‌లో సంబంధిత డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం నిర్దేశించిన పీనలైజేషన్ ఛార్జీలు మరియు ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఒంగోలు పట్టణాభివద్ధి సంస్థ కార్యాలయం నందు సంప్రదించాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి

రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం నాడు సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. కె.సుబ్బారాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొర్నిపాటి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ కార్మికులు అనేక సమస్యలతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. జూలై 12 నుండి పది రోజులు పాటు సమ్మె కొనసాగినప్పటికీ, ప్రభుత్వం నుండి ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 21న మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణతో జరిగిన చర్చల సందర్భంగా, సమ్మె సమయంలో కోల్పోయిన వేతనాలను చెల్లిస్తామని, 17 రోజులు సమ్మె కాలపు జీవోలు జారీ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, నేటికీ చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. ఇచ్చిన హామీల మేరకు జిల్లాలో మరణించిన లేదా అనారోగ్యంతో ఉద్యోగం చేయలేని కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం ఇవ్వాలని, కోవిడ్ కాలంలో పనిచేసిన కార్మికులను ఆప్కాస్‌లోకి చేర్చాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయడంతో పాటు కనీస వేతనాలు అమలు చేయడం, ఒంగోలు కార్పొరేషన్‌లో కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలని కోరారు. సమస్యల పరిష్కారం కాకపోతే జిల్లాలోని మున్సిపల్ కార్మికులంతా ఐక్యంగా పోరాటాలు చేపడతారని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సామ్రాజ్యం, జిల్లా నాయకులు పి పద్మ, మరియమ్మ, ఇ ఏడుకొండలు, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీల ఆడిట్‌లో నిర్లక్ష్యం వద్దు

అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

గ్రీవెన్స్ అర్జీల ఆడిట్ విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీలు పరిష్కారమవుతున్న తీరుతో పాటు పౌరసరఫరాలు, రెవెన్యూ సంబంధిత అంశాలపై బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణతో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి సైతం ఈ కార్యక్రమంపై సమీక్షిస్తున్నట్లు ఆమె వివరించారు. ఆడిట్‌లో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల విషయంలో పెండింగ్ ఉండకూడదన్నారు. ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తుండటంతో అర్జీదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా మాట్లాడాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. దుకాణాల ద్వారా, వృద్ధులకు నేరుగా ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీలోనూ పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. వీటి పైనా ఐవిఆర్ఎస్ ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతికూల అభిప్రాయాలు వచ్చిన రేషన్ దుకాణాలలో ప్రత్యేక అధికారుల ద్వారా తనిఖీలు చేయించి వాస్తవ పరిస్థితిని గుర్తించాలని ఆదేశించారు. అర్హులైన పేదలకు పంపిణీ చేసేందుకు ఇళ్ల స్థలాల గుర్తింపు, పట్టాదారు పాస్ పుస్తకాల ముద్రణలో పురోగతి, జాయింట్ ఎల్‌పిఎం కేసుల పరిష్కారంలో పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. పేదలకు పంపిణీ చేసేందుకు ఇప్పటికే గుర్తించిన ప్లాట్‌లలో ఖాళీలు, సాంకేతిక ఇబ్బందులపైనా అధికారులతో ఆమె చర్చించారు. సమావేశంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, డిఎస్ఓ ఎస్. పద్మశ్రీ, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి రవి, గ్రీవెన్స్ ఆడిట్ బంద సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

11 నుంచి ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు

డిఇఒ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణమండలి రూపొందించిన ఎఫ్ఎ-1 పరీక్షల షెడ్యూల్, సిలబస్ విడుదల అయినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్, డిసిఇబి సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఆగస్టు 11వ తేదీ నుండి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మంగళవారం నాడు మీడియాకు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి అనుగుణంగా నూతన అసెస్మెంట్ విధానం అమల్లోకి తెచ్చినట్లు వారు వివరించారు. ఈ విధానం విద్యార్థులకు మానసిక ఒత్తిడిని తగ్గిస్తూ, అనేక కోణాలలో వారి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఆయా తరగతుల వారీగా ప్రశ్నపత్రాల నమూనాలు, మార్కుల పంపిణీ విధానం, సిలబస్ మరియు పరీక్షల నిర్వహణకు సంబంధించి ముఖ్యమైన మార్గదర్శకాలు కూడా విడుదలైనట్లు వెల్లడించారు. ఒకటి నుంచి 5 వరకు 11న తెలుగు, గణితం, 12న ఇంగ్లీష్, పర్యావరణ శాస్త్రం, 13న ఓఎస్ఎస్సి ఆరోతరగతి నుంచి 10 వరకు11న తెలుగు, గణితం, 12న హిందీ, ఫిజికల్ సైన్స్,13న ఇంగ్లీష్, సోషల్,14న బయాలజీ, ఓఎస్ఎస్సి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎంఇఒలు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, సీఆర్‌పీలు పరీక్షల పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మై భారత్ ప్రకాశం జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఏక్ పెడ్ మా కా నామ్ (అమ్మ కోసం ఒక మొక్క నాటడం) కార్యక్రమంలో భాగంగా ఒంగోలు మంగమ్మ డిగ్రీ కళాశాల ఆవరణలో పలు రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశంలోని ప్రతి ఒక్కరూ వారి అమ్మ పేర ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన వారవమవుతామన్నారు మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణంతో పాటు మానవ జీవనావళికి తోడ్పాటుగా ఉంటుందన్నారు. మొక్కలను రక్షించడం ద్వారా అవి మనల్ని రక్షిస్తాయని, ప్రతి ఒక్కరూ వారి ఇళ్లు, గ్రామాలు, నగరాల్లో మొక్కలను పెంచాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఏవో రాంబాబు రావు, ప్రిన్సిపల్ రంగారావు, ఫస్ట్ బోర్డు సభ్యులు సత్యనారాయణ , అకాడమిక్ ఆర్గనైజర్ సిద్ధాంబి , అధ్యాపకులు భాస్కరరావు, నరసింహులు, సాజిద్, మై భారత్ వాలంటీర్లు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత దినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

జాతీయ చేనేత దినోత్సవ సభకు చీరాల నియోజకవర్గం లోని చేనేత, అనుబంధ విభాగాలలో పని చేసే కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని చీరాల ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు.ఈ నెల 7న గురువారం చేనేత మాస్టర్ వీవర్స్ ఆధ్వర్యంలో చీరాల మండలం జాండ్రపేట హైస్కూల్ క్రీడా మైదానంలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య స్పష్టం చేశారు. ఈ క్రమంలో సభ ప్రాంగణం ఏర్పాట్లను బుధవారం స్థానిక కూటమి నేతలతో కలసి అయన పరిశీలించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రారంభం కానున్న చేనేత దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు సవితా, కొలుసు పార్థసారథి, డోలా వీరాంజనేయులు, జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో రానున్న సంవత్సర కాలంలో చీరాలలో చేనేతల కలగా మారిన చేనేత పార్కును సీఎం చంద్రబాబుతో భూమి పూజ చేయిస్తానని పేర్కొన్నారు.

కొండపి నియోజకవర్గానికి సాగర్ జలాలు

ప్రజాశక్తి-కొండపి: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగర్ జలాలు కేటాయించినందుకు మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, మంత్రి నిమ్మల రామానాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. దర్శి దగ్గర ఒంగోలు బ్రాంచ్ కెనాల్ నుంచి మూసి వాగులోకి వెలుగు వారిపాలెం దగ్గర నుంచి 0.6 టీఎంసీల నీరు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది.

సీఎం సహాయ నిధి అందజేస్తున్న ఆనందబాబు

సీఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - అమృతలూరు

మండలానికి చెందిన ఆరుగురు అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకునేందుకు అయిన ఖర్చును ఎంఎల్ఎ నక్క ఆనందబాబు సిఫార్సు మేరకు మంజూరైన సిఎం సహాయ నిధి రూ.6,32,883 ని లబ్దిదారులకు బుధవారం అందజేశారు. వీరిలో కూచిపూడికి చెందిన గట్టిపాటి నాగరాజకుమారికి రూ.1.62 లక్షలు, పెదపూడికి చెందిన షేక్ ఫాతిమాబికి రూ.1,37,243, గోవాడకు చెందిన కుర్రా కోటేశ్వరరావుకు రూ.1,28,750, అమృతలూరుకు చెందిన వెలువోలు మదనమోహనరావుకు రూ.81,662, బోరుగడ్డ జపమాలరాణికి రూ.58,970, ఇంటూరుకు చెందిన తిరళ్ళుక రంగనాయకమ్మకు రూ.64,258 చొప్పున అందజేశారు.

నాగభూషణంకు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నంబూరు నాగభూషణం

మండలంలోని వెల్లటూరుకు చెందిన విశ్రాంత కళాశాల ఉద్యోగి నంబూరు నాగభూషణరావు ఈనెల 14న పలు అవార్డులు అందుకోనున్నారు. హైదరాబాద్ కళా భారతిలో నీతి ఆయోగ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాచే నిర్ధారించబడిన మనం ఫౌండేషన్ నిర్వహిస్తున్న 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రధానం చేయనున్నారు. వివిధ రంగాల్లో నాగభూషణరావు చేసిన సేవలను గుర్తించి ఆయనకు 'భారత సేవారత్న' జాతీయ అవార్డు, గౌరవ డాక్టరేట్ అందించనున్నట్లు ఆయన తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా విద్యాభివృద్ధి, వివిధ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు, గ్రామ స్థాయి నుండి మహాసభ వరకు ఆర్యవైశ్య సంఘంలో పదవులు నిర్వహించి పలువురి మన్ననలు పొందారు. వాసవి క్లబ్ గ్రామంలో స్థాపించి ఇంటర్నేషనల్ పదవులు అలంకరించి ఎన్నో అవార్డులు సాధించారు. వృత్తి పరంగా మద్దుల వెంకటగిరిరావు, రామాయమ్మ డిగ్రీ కళాశాల్లో నాలుగు దశాబ్దాలుగా సేవలందించారు. కళాశాల యాజమాన్యం, తోటి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. శ్రీ వాణి నికేతన్ స్థాపించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపారు. రాష్ట్ర కళాశాల అధ్యాపకేతర, సభ్యుల సంఘంకు రాష్ట్ర స్థాయి మెంబర్‌గా, సంఘం ఎన్నికల అధికారిగా పదవులు చేపట్టిన నాగభూషణరావు అవార్డులకు ఎంపికైన సందర్భంగా ఆయన మిత్రులు, బంధువులు అభినందించారు.

వైసీపీ నాయకుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నివాళులర్పిస్తున్న నాయకులు

మండలంలోని ఐలవరంకు చెందిన మద్దూరి ప్రతాప్ (55) బుధవారం రాత్రి 216 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం డీ కొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వడ్రంగి పని చేస్తూ జీవిస్తూ ఉంటాడు. మృతి సమాచారం తెలుసుకున్న వైసీపీ నాయకులు కరీంశెట్టి బాలు ఆధ్వర్యంలో ప్రతాపు మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి రు.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆ కుటుంబానికి తాము అండగా ఉంటామని ఓదార్చి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాచర్ల హేమసుందరరావు, బొజ్జ లాజరు, ఏసుబాబు, అరుణ్ శాస్త్రి, ఇస్సాకు, ఇమ్మానియేలు ఉన్నారు.

'సముద్రపు' సాగుతో మత్స్యకారులకు జీవనోపాధి

- కప్పఫికస్‌తో స్థానిక ప్రజలకు ఉపాధి
- పెద్దగంజాంలో సముద్రపు సాగు
- పరిశీలించిన ఎమ్మెల్యే ఏలూరి

కప్పాఫైకస్ సముద్రపు పంటను పరిశీలిస్తున్న ఏలూరి

ప్రజాశక్తి - వేటపాలెం, చిన్నగంజాం

చినగంజాం మండలం పెద్దగంజాం సముద్ర తీరప్రాంతాల్లో కప్పఫికస్ అల్వారెజి అనే సముద్రపు సాగుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, దీని ద్వారా స్థానిక మత్స్యకారులు, రైతులకు కొత్త ఆదాయ వనరులు ఏర్పడతాయని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతంలో సముద్రపు ఫార్మింగ్ కప్పఫికస్ అల్వారెజి పంటను ఆయన బుధవారం సందర్శించారు. పంట సాగు, విత్తనోత్పత్తి, మార్కెటింగ్, ప్రాసెసింగ్ తదితర అంశాలపై స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. తీరప్రాంతాల్లో సివిడ్ సాగు స్వల్ప వ్యయంతో పర్యావరణానికి హానీ లేకుండా చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై రాఫ్ట్, పైపులు, ఎదురు కర్రలు, ట్యూబ్ లైన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కప్పఫికస్ అల్వారెజి అనేది ఒక రకమైన ఎరుపు సముద్రపు తారు మొక్క అన్నారు. ఇది కరేజీనన్ అనే ఔషధ ఆహార పరిశ్రమల్లో విస్తృతంగా ఉపయోగించే పదార్ధం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దీనికి డిమాండ్ ఉన్నదని అన్నారు. మన తీరప్రాంతాల్లో దీని సాగుకు అవసరమైన పర్యావరణం, అవకాశాలు ఉన్నాయని అన్నారు. మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశం కల్పిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర సముద్ర పరిశోధనా సంస్థల సహకారంతో నియోజకవర్గంలోని తీరప్రాంతాల్లో ఈ సాగును ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పొద వీరయ్య, ప్రధాన కార్యదర్శి ఆజాద్, ఇంకొల్లు అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, నాయకులు అనోసి సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, వెంకటరెడ్డి, కృష్ణ, కోటయ్య, యార్లగడ్డ లక్ష్మీ, సత్యనారాయణ, రైతు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చుండూరు మృతవీరులకు నివాళులు

ప్రజాశక్తి - చుండూరు

మృత వీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

34ఏళ్ల క్రీతం చుండూరు నరమేధంలో మరణించిన దళిత మృత వీరులకు దళిత చైతన్య వేదిక నాయకులు బుధవారం నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటి గ్రామంలోని కందికట్ల వారి గ్రూప్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత చైతన్య వేదిక రాష్ట్ర కోర్డినేటర్ చింతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టా సురేష్ అధ్యక్షతన చుండూరు దళిత మృత వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. మృత వీరులకు రెండు నింషాలు మౌనం పాటిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నీలి జెండాలు ధరించి దళిత చైతన్య వేదిక నాయకులు నినాదాలు చేశారు. ఆగస్ట్ 6న యావత్ దళిత సమాజానికి మరిచిపోలేని నెత్తుటి మరకల చీకటి రోజని అన్నారు. ఆధిపత్య వర్గాల కుల దురహంకారులతో పోరాడి ప్రాణాలోదిన దళిత మృత వీరులను స్మరించుకుంటూ దళిత ఆత్మ గౌరవ పోరాట రోజుగా పాటిస్తుందని అన్నారు. దళితులపై నేటికి వివక్ష కొనసాగుతూనే ఉందని అన్నారు. దళితులు రాజకీమాలకు అతీతంగా మరో ఆత్మాభిమాన పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు చిలకపాటి శ్రీధర్, వేదిక జిల్లా అధ్యక్షులు లిఖితపూడి బుజ్జి, వేదిక రాజోలు మండల అధ్యక్షులు మందపాటి మధు, బుంగ శ్రీను, గోగి మోహన్, మెడబల శ్యాం శేఖర్, చింతా సత్య ప్రసాద్, గొల్లమందల పొన్నమండ శేషు, డాక్టర్ బాబు, పోతుమూడి రవి కుమార్, తోట జాన్ బాబు, పాలపర్తి విజయ్ మోహన్, తోట అబ్బులు, పెయ్యిల రవి కుమార్, బొంతు చందు, గుమ్మాపు చందు, తోట అఖిల్, కందికట్ల సురేంద్ర పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు ఆపాలంటున్న గ్రామస్తులు

ఇసుక తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని చింతల లంక గ్రామంలో పంట పొలాలకు ఆనుకుని జరుగుతున్న ఇసుక తవ్వకాలతో పంట పొలాలు, ప్రక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ఇసుక ట్రాక్టర్ల వల్ల ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రాథమిక పాఠశాలకు దగ్గర్లో ఇసుక తవ్వకాలు చేస్తూ వందలాది ట్రాక్టర్లు పాఠశాల ప్రక్కగా వెళ్లడం వల్ల పెద్ద పెద్ద శబ్దాలతో ట్రాక్టర్లపై టేప్‌రికార్డులు పెట్టుకోవడం వల్ల పిల్లల చదువుకు ఆటంకంగా ఉందని గ్రామస్థులు అంటున్నారు. పాటు పాఠశాలకు వెళ్లి రావాలంటే దారి రద్దీ పెరిగి చిన్న పిల్లలు నడవలేక ఇబ్బంది పడుతున్నారు మరియు పిల్లలకు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయని పిల్లల తల్లిదండ్రులు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారని ఇంత జరుగుతున్నా ఇసుక తవ్వకాలపై అధికారులు పట్టించుకోకపోవడం హేయమైన చర్య అని గ్రామస్తులు అంటున్నారు ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను మరియు ట్రాక్టర్లను నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుచున్నారు లేని పక్షంలో విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేస్తామని గ్రామస్తులు అంటున్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకున్న గ్రామస్థులు

దొంగను పట్టుకున్న యువకులు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతరంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్చల్ చేశారు. వేణుగోపాలస్వామి గుడి ఎదురుగా ఉన్న ఆచార్యులు ఇంట్లో దొంగ ప్రవేశిస్తుండగా అదే సమయంలో ఇంటిపై ఫోన్ మాట్లాడుకుంటున్నా కళ్యాణ్ అనే యువకుడు గమనించి అనుమానంతో చుట్టుపక్కల వారిని నిద్రలేపి అప్రమత్తం చేయడంతో ఆ దొంగ తాను వచ్చిన ద్విచక్ర వాహనంపై పారిపోయే ప్రయత్నం చేశాడు. బైకు తాళంచెవి బురదలో చిక్కుకోవడంతో గ్రామస్తులు అతన్ని పట్టుకున్నారు. అర్ధరాత్రి యద్దనపూడి పోలీసులుకు సమాచారం ఇచ్చారు. ఆ సమయంలో తన సిబ్బందితో వచ్చిన ఎస్ఐ రత్నకుమారి దొంగను అదుపులోకి తీసుకుని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనతో భయభ్రాంతులకు గురైన కొంతమంది తమ ఇళ్లకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. దొంగలు గ్రామంలోని అన్నపూర్ణమ్మ గుడి, వినాయకుని గుడి, వేణుగోపాల స్వామి గుడి తోపాటు గుడి ఎదురుగా ఉన్న ఆచార్యులు ఇంటిలోనూ దొంగతనానికి ప్రయత్నించారు. గ్రామంలో దొంగలు పడ్డ విషయం సంచలనంగా మారింది. దొంగలను పట్టుకోవడంలో సాహసం చూపిన లావు కల్యాణం, వాసు, దొప్పులపూడి వేణుబాబు, రావి గోపయ్యను గ్రామస్థులు అభినందిస్తున్నారు. గ్రామంలో పోలీసు గస్తీ పెంచి దొంగల బెడద నుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బల్లికురవ : మండలంలోని రామాంజనేయపురంలో మంగళవారం అర్ధరాత్రి గుంటుపల్లి గురుమూర్తి ఇంటిలో గుర్తుతెలియని దొంగలు ప్రవేశించి బీరువా పగలగొట్టి 3సవర్ల బంగారు ఆభరణాలు, 30 తులాలు వెండి, రూ.1500 నగదు దొంగిలించారని ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని సంతమాగులూరు సిఐ వెంకట్రావు, బల్లికుర ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. ఇటీవల దొంగతనాలు తరచూ జరుగు తున్నాయని, దీనిపై ఆయా గ్రామాల ప్రజలు నిఘా పెట్టాలని కోరారు.

దొంగ చేతులు కట్టేసిన గ్రామస్థులు, దొంగవాడిన బైకు

సాగునీటి కాలువ పరిశీలిస్తున్న ఎడిఎ ఎ లక్ష్మి

వారబందీ పద్ధతిలో సాగునీరు

ప్రజాశక్తి - వేమూరు

మండలంలో పలు గ్రామాలకు సాగునీటిని వారబందీ పద్ధతిలో విడుదల చేస్తున్నట్లు రేపల్లె ఎడిఎ ఎ లక్ష్మి తెలిపారు. ఎఒ గల్లా ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వెద పద్ధతిన సాగు చేసిన రైతులకు కలుపు నివారణ, ఎరువుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఛానల్ 1, 2లలో ప్రస్తుతం సాగునీరు విడుదల అవుతుందని, వారబందీ పద్ధతిలో అబ్బన గూడవల్లి, బలిజేపల్లి, కోడిపరు, ఎనమర్రు గ్రామాలకు దశలవారీగా నీటి విడుదల చేస్తారని తెలిపారు. త్వరలో డిసిఎంఎస్‌కు డిఏపీ, యూరియా విడుదల అవుతుందని తెలిపారు. ఎరువుల కోసం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అన్నదాత సుఖీభవ డబ్బు జమ కాని రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో విఎఎలను కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. విహెచ్ఎ శిరీష, లష్కర్ కరిముల్లా, విఎఎలు పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుతో ఆరోగ్యవంతమైన దిగుబడులు

ప్రజాశక్తి - అద్దంకి

సేంద్రీయ సాగు పద్ధతుల ద్వారా వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని ఎఐ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు కనీసం ఒక్క ఎకరమైన రసాయన రహిత సేద్యానికి సన్నద్ధం కావాలని సూచించారు. రసాయన రహిత ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. రసాయన అవశేషాలు కలిగిన ఆహార పదార్థాలు తినడం వలన చిన్న వయస్సులోనే దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ నగదు పడని రైతులు గ్రీవెన్స్ నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ సీత, ప్రత్యూష, ఎఇఒ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నగరం : మండలంలోని బోరమాదిగపల్లె రైతు సేవ కేంద్రం పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఎఇ వి రమేష్ బాబు వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర సందర్శన చేసి వరి నారు మళ్ళ, పచ్చిరొట్ట పైర్ల పరిశీలించారు. రైతులకు సూచనలు ఇచ్చారు. పంటల భీమా చేయించుకోవాలని చెప్పారు. ఈనెల 15లోపు భీమా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఇఒ కె నాగ శ్రీనివాసరావు, విఎఎ పి చైతన్య, టిడిపి అధ్యక్షులు పమిడి పాముల వీరయ్య, కారంకి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : భూమిలో సేంద్రీయ కర్బన శాతాన్ని పెంచేందుకు ప్రకృతి వ్యవసాయం ఒక్కటే ఉత్తమ

మాట్లాడుతున్న అద్దంకి ఎఒ కె వెంకటకృష్ణ

మార్గమని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. మండలంలోని కోలపూడిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ద్వారా గ్రామంలో రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరారు. త్వరలో సొసైటీకి లైసెన్స్ మంజూరు చేసి ఎరువులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ రైతు సాంబశివరావు పొలంలో వేసిన 20రకాల పిఎండిఎస్ విత్తన ప్లాట్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎడిఎ కె సుదర్శనరాజు, ఎఒ రామినేని లావణ్య, రైతు సంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, తాటి నాగార్జున పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని జాగర్లమూడి, పెద్దివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ కుమారి మాట్లాడారు. మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకొని, సేంద్రీయ కర్బన శాతాన్ని పెంచుకోవడం, సమస్యాత్మక భూములు ఉంటే సరిచేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు శనగ, మినుము, జొన్న, మొక్కజొన్న సాగు చేసుకోవాలని తెలిపారు. రబీ పంటలకు ముందు భూమిని ఖాళీగా ఉంచకుండా పెసర, పిల్లిపెసర, నవధాన్యపు విత్తనాలు వేసి పూత దశలో దున్నడం ద్వారా భూమి సారవంతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ నవీన్, ఎంపిటిసి సాంబశివరావు, ఉపసర్పంచ్ వెంకట స్వామి, పెద్దివారిపాలెం సర్పంచ్ అప్పయ్య చౌదరి పాల్గొన్నారు.

కారంచేడు : అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతులు తమ పరిధిలోని రైతు సేవ కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని ఎఒ నాగరాజు సూచించారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల ఎఒ సరళ మాట్లాడుతూ వరి సాగు రైతులు మేలైన వరి రకాలు ఎంపిక చేసుకోవాలని చెప్పారు. వరిలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు తెలిపారు.

రేపల్లె : మండలంలోని అరవపల్లి, నల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ ఎ మహేష్ మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్‌లో పంటలు నమోదు చేయించుకోవాలని సూచించారు. వరి పంటకు ఆగస్టు 15లోపు సిఎంఎస్సి కేంద్రాల్లో ఎకరాకు రూ.800 భీమా ప్రీమియం చెల్లించుకోవాలని తెలిపారు. ఏదైనా విపత్తులు జరిగి పంట నష్టపోతే రూ.40వేలు బీమా పొందుతారని అన్నారు. ఈ నెల 31లోపు అన్నదాత సుఖీభవ వివరాలు సరిగా నమోదు చేసుకుంటే తిరిగి లబ్ది పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో విఎఎ వి లక్ష్మణ సాయి, సుధీర పాల్గొన్నారు.

ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉపకరణాల నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని సత్రంబడి ఆవరణలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ప్రత్యేక అవసరాలుగల విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సహిత విద్య సమన్వయకర్త మట్టా జ్యోత్స్న తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అలెంకో సంస్థ సహకారంతో మెడికల్ అస్సెస్మెంట్ క్యాంపులో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, కొరిసపాడు, జె పంగులూరు, సంతమాగులూరు మండలాల్లోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అలింకో సంస్థ ద్వారా ఉచితంగా ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు. ఆటిజం సెంటర్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కొక ఆటిజం సెంటరుకు రూ.27.75 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం కాన్పూర్ అలెంకో సంస్థ నుండి వచ్చిన వైద్యులు ప్రియావర్మ, తుషార్ వర్మ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అర్హులకు వారికి తగిన ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు. బల్లికురవ ఎంఇఒ కె శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎం ధనలక్ష్మి, జె బాబూరావు, కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని చిమటావారిపాలెంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, బాలింతలు, గర్భిణీ స్త్రీల సమావేశం బుధవారం నిర్వహించారు. యద్దనపుడి సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి ఆరోగ్య ప్రయో జనాలు ఉన్నాయని చెప్పారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వటం వలన రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారించవచ్చని చెప్పారు. గర్భిణిగా ఉన్న సమయంలో పెరిగిన శరీర ఆకృతి సాధారణ స్థితికి బిడ్డకు పాలు ఇవ్వటం వలన వస్తుందని తెలిపారు తల్లి, బిడ్డల మధ్య

మాట్లాడుతున్న యద్దనపూడి సూపర్వైజర్ సుజాత

అనుబంధం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిమట వారిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జె శామ్యూల్ రాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ చిన్న పిల్లలు మట్టి ముద్ద వంటి వారని, మట్టిముద్దలతో మనం బొమ్మలు ఏ ఏ ఆకృతిలో తయారు చేస్తే అలాంటి బొమ్మ తయారైనట్లు పిల్లలను చిన్నతనం నుండి మనం ఎలాంటి అలవాట్లు చేస్తామో అలాగే పెరుగుతారని అన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త నాగమణి, కటారివారిపాలెం, చిమటవారిపాలెం అంగన్వాడి కార్యకర్తలు కె హైమావతి, రేవతి, ఆయా జె అనుష పాల్గొన్నారు.

వేటపాలెం : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టులోని పందిళ్ళపల్లి అంగనవాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది గర్భిణీలకు శ్రీమంతం చేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎవి శేషమ్మ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా వంటివని అన్నారు. ప్రతి ఒక్కరు బిడ్డకు ముర్రుపాలు పట్టాలని సూచించారు. మాజీ ఉపసర్పంచ్, టిడిపి నాయకులు పోలకం చంద్రశేఖర్, పారశాల హెచ్ఎం పి శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్తలు పి పద్మావతి, కె సుజాత, జి పద్మావతి, ఎస్ రాజేశ్వరి, కె ఉష, జి షకీలా, వై సీయోను కుమారి, ఎంఎస్ కేలు భవాని, నీలిమ పాల్గొన్నారు.

వేమూరు : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లిపాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ జి శకుంతల, పద్మావతి సూచించారు. చుండూరు మండలంలోని మండూరులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు ముద్దు, పోత పాలు వద్దు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడు నెలల చిన్నారులకు అన్నప్రసనం చేశారు.

భట్టిప్రోలు : స్థానిక మారం పాఠశాల్లో అంగన్వాడీ కేంద్రం సూపర్వైజర్ సంపూర్ణ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పర్చూరు : బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యమని సిడిపిఒ జి సుభద్ర పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక పిహెచ్‌సి ఆవరణలో గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. పాలివ్వడం ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్, డయాబెటిస్ రాకుండా ఉంటుందని తెలిపారు. సిహెచ్‌సి డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు తాపించడం వల్ల బిడ్డ, తల్లి అనుబంధం పెరుగుతుందని చెప్పారు.

సంతమాగులూరు : అంగన్‌వాడి సెంటర్లకు సరఫరా చేసే కోడిగుడ్లకు కలర్ కోడ్ ఇవ్వడం లేదని, సిడిపిఒ తగిన చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధా మాధవి తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవం, ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమం సిడిపిఒ డి సుధ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అంగన్వాడి సెంటర్స్ పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. అన్ని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అన్నారు. సిడిపిఒ డి సుధ మాట్లాడుతూ కొత్తగా గర్భం దాల్చిన మహిళలకు ముందుగానే తల్లిపాల ప్రాముఖ్యత తెలియజేయాలని అన్నారు. పిహెచ్‌సి డాక్టర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి, బిడ్డకు మంచి ఆరోగ్యం అన్నారు. రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్ వంటివి రావన్నారు. అనంతరం ప్రాజెక్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిపి ఛైర్మన్ టి రమేష్, సూపర్ వైజర్ జి ప్రమీల, సుష్మరాణి పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని కారంచేడు, స్వర్ణ గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కారంచేడులో ఐసిడిఎస్ సూపర్వైజర్ హిమబిందు 9వ నెల గర్భవతి ఇంటికి వెళ్లి సూచనలు చేశారు. బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ రాణి, రాధ పాల్గొన్నారు. స్వర్ణ పంచాయితీ కార్యాలయం వద్ద ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు, చెట్లలోకి వెళ్లిన ఆర్టీసీ

ఆర్టీసిని ఢీ కొట్టిన ట్రావెల్ బస్సు

ప్రజాశక్తి - చీరాల

ఆర్టీసీ బస్సును ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీ కొట్టడంతో ఆర్టీసి బస్సు రోడ్డుపక్కనున్న చిల చెట్లలోకి దూసుకెళ్లింది. అయితే ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సును నిలిపేయడంతో పెను ప్రమాదం తప్పింది. చీరాల, కారంచేడు మార్గం మధ్యలో బుధవారం ఉదయం ఘటన చోటు చేసుకుంది. చీరాల నుండి నరసరావుపేటకు బయలు దేరిన బస్సు కారంచేడు మార్గంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ప్రయివేటు బస్సును తప్పించబోగా అదుపు తప్పిన ట్రావెల్ బస్సు ఢీ కొట్టడంతో ఆర్టీసీ బస్సు రోడ్డుపక్కనే ఉన్న చెట్లలోకి దూసు కెళ్లింది. ఘటన సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికు లు ఉన్నారు. హైదరాబాద్ నుండి చీరాల వస్తున్న ట్రావెల్స్ బస్సులో 10 మంది ప్రయాణికులు ఉన్నారు. అప్రమత్తతతో డ్రైవర్ బస్సును పూర్తిగా చెట్లలోకి వెళ్లకుండా ఆపటంతో తీవ్ర ప్రమాదం తప్పింది. ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. పలువురుకి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ సంఘటనను పరిశీలించిన స్థానికులు అధికారులకు సమా చారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

స్కానర్ ప్లకార్డ్ చూపిస్తున్న కరణం వెంకటేష్

మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - చీరాల

కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు ఆరోపించారు. మండలంలోని కావూరివారి పాలెంలో 'బాబు షురిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీలు తుంగలో తొక్కి వంచన పాలన సాగిస్తోందని ఆరోపించారు.

వేటపాలెం : మండలంలోని దేశాయిపేటలో జరిగిన 'బాబు షురిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సాదు రాఘవ, బొడ్డు సుబ్బారావు, నలమల దావీద్, బండికళ్ళ నరేష్, కరణ లచ్చారావు, మద్దులూరి సీతామహాలక్ష్మి, సర్పంచ్ కందేటి రమణ, ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, బాలాబత్తిని నర్సదా ప్రశాంతి, ఖాదర్, పృథ్వి వెంకటేశ్వర్లు, జమ్మి ప్రసాదరెడ్డి, రాఘవరెడ్డి, హాలీ సాహెబ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి మధుసూధనరెడ్డి

యద్దనపూడి : మండలంలోని శ్యామల వారిపాలెం, పోలూరు, విజయనంపాడు గ్రామాల్లో వైసీపీ ఇంచార్జి గాదే మధుసూదనరెడ్డి పర్యటించారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో రావూరి వేణుబాబు, ముప్పా రాంబాబు, మాజీ సర్పంచ్ చిలుకూరు కృష్ణయ్య, సర్పంచ్ సుజాత బాలకృష్ణ, ఉప్పలపాటి అనిల్, ఎంపీపీ రజిని కుమారుడు వంశీ, దొడ్డ రవి, పోతిరెడ్డి, టి సుభాష్, రామకృష్ణ, వీరయ్య చౌదరి, అఖిల్, నల్లపనేని వీరేంద్ర, లక్ష్మీనారాయణ, వందనం, సుబ్బారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోక్సో కేసులో..

టీచర్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోక్సో కేసులో ఓ ఉపాధ్యాయుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. గిద్దలూరు మండలానికి చెందిన బాలిక కలసపాడులో చదువుతుండగా టీచర్ వీరయ్య తరచూ వేధించేవాడు. బాలిక ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించేవాడు. 2018లో పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా నేరం రుజువు కావడంతో ఆయనకు కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష, 15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువడించ. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ దామోదర్ అభినందించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన

48 మందిపై కేసులు నమోదు

ఎస్పీ తుషార్‌డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ ఉల్లంఘనల నివారణ చర్యల్లో భాగంగా ఆగస్టు నెలలో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 48 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని సంబంధిత న్యాయస్థానాలలో హాజరుపరవడం జరుగుతుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు. అతివేగం, హెల్మెట్ ధారణ, బ్లాక్ స్పాట్ సందర్శన వంటి వాటి పై కూడా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేస్తున్న పోలీసులు

వ్యాధుల నుండి

రక్షించాల్సిన బాధ్యత అధికారులదే..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుండి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్‌లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా అధికారులతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో, మండలంలో మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు, వైద్యాధికారులు ఒక ప్రణాళిక ప్రకారం నివాస ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని తెలిపారు. నగరం మండలం ఈదుపల్లి గ్రామంలో ఒక డెంగీ మృతి నమోదయిందని తెలిపారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఒక్కరికి జ్వరం వచ్చినట్లు తెలిసిన వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి వాటిని పరీక్షలకు పంపి వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిపిఓ ప్రభాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, మండల ప్రత్యేక అధికారులు, డిఎల్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

మత్స్యకారులను

వెంటాడుతున్న కడలూరు బోట్లు

- ఆ బోట్ల వేగానికి.. ఇక్కడి వలలకు దెబ్బ
- నెల్లూరు జిల్లాలో 2 కడలూరు బోట్లను వేటాడి పట్టుకున్న మత్స్యకారులు
- సమస్య పరిష్కారం చేయాలని వేటకు వెళ్లకుండా దురాయి..
- సమస్య పరిష్కారం చేయాలంటున్న 64 మత్స్యకార గ్రామాలు

సముద్రంలో దూసుకుపోతున్న కడలూరు బోటు

ప్రజాశక్తి-శింగరాయకొండ

తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు తీరం నుంచి వచ్చే పెద్ద బోట్లు ఇక్కడ మత్స్యకారులను ఆతలాకుతలం చేస్తున్నాయి. అక్కడ నుంచి వచ్చి ఇక్కడ ఆ బోట్లు వేట చేయటం ద్వారా ఇక్కడ మత్స్యకారుల వలలకు, మత్స్య సంపదకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఈ సమస్య పరిష్కారం చేయాలని గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నుంచి నేటి కూటమి ప్రభుత్వం వరకు మత్స్యకారులు సముద్ర తీర ప్రాంతంలోని శాసనసభ్యులను, మంత్రులను అడుగుతూనే ఉన్నారు. అయితే ప్రజాప్రతినిధులు చెప్పిన సమయంలో మత్స్యశాఖ అధికారులు మెరైన్ పోలీసులు హడావుడి చేస్తారు.. ఆ తర్వాత వదిలేయడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. తమకు న్యాయం చేయాలని నెల్లూరు, ప్రకాశం బాపట్ల జిల్లాల 64 పట్టపు కాపులు వారం రోజుల క్రితం నెల్లూరులో సమావేశమై సమస్య పరిష్కారం చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం దురాయి వేసుకొని వేట నిలిపి వేయటం జరిగింది. మత్స్యశాఖ అధికారులపై, మెరైన్ పోలీసులపై నమ్మకం లేకపోవడంతో మత్స్యకారులే నెల్లూరు జిల్లాలో రంగంలోకి దిగారు. కడలూరు బోట్లను వెంటాడి రెండు బోట్లను పట్టుకున్నారు. తుమ్మలపెంట దగ్గర ఒక బోటును పట్టుకోగా.. మరో బోటును ఇందుకూరుపేట మండలం కృష్ణాపురంలో పట్టుకొని వాటిని జువ్వలదిన్నె హార్బర్ వద్ద ఉంచారు. ప్రతిరోజూ కడలూరు నుంచి వచ్చే బోట్లు ఇక్కడ మత్స్యకారుల సంపదను దోచుకుపోతుంటే...మత్స్యశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని, ఈ సమస్యను పరిష్కారం చేయాలని మత్స్యకారులు కొన్ని రోజులుగా దురాయి వేసుకొని సముద్రంలో వేటకు వెళ్లకుండా వేటను నిలిపివేశారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో సముద్ర తీర ప్రాంతంలోని పట్టపు మత్స్యకారులు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. పాకల మత్స్యకారులను ఈ విషయంపై 'ప్రజాశక్తి' అడగగా కడలూరు నుంచి వచ్చే బోట్ల వల్ల ఇక్కడ మత్స్యకారులుగా తాము ఎంతో నష్టపోతున్నామని, ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే స్పందించి. మత్స్యకారులకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

'కొండపి' సర్పంచి..

ఏకగ్రీవ ప్రక్రియ అప్రజాస్వామికం

- బరిలో నిలిచిన సర్పంచి అభ్యర్థి మేరి సంతకం ఫోర్జరీ
- పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి..
- అవసరం అయితే న్యాయపోరాటం చేస్తాం...
- స్పష్టం చేసిన వైసీపీ నేతలు

సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కొండపి పంచాయతీ సర్పంచి ఏకగ్రీవ ప్రక్రియ అప్రజాస్వామికమని, ఈ ప్రక్రియ భారత రాజ్యాంగానికి ఘోరమైన అవమానమని వైసీపీ నాయకులు తీవ్రంగా ఆరోపించారు. బుధవారం సాయంత్రం వైసిపి జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, కొండేపి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పుష్కర కాలం తరువాత అవకాశం వచ్చిన కొండపి పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యపద్ధతిలో జరగనీయలేదని దుయ్య బట్టారు. పోటీ చేసేందుకు అభ్యర్ధులను, ఓటర్లను సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి స్వామి, మారిటైమ్ బోర్డు చైర్మన్ సత్య, కూటమి నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకొని హింసాత్మకంగా, భయోత్పాతం సృష్టించి, నామినేషన్ వేసిన వైసిపి మద్దతుదారులను బెదిరించి, సంతకాలు ఫోర్జరీ చేసి ఎన్నికల అధికారితో బలవంతంగా సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటింపచేశారని ఆరోపించారు. ఈ నెల 3 నుంచి నామినేషన్ ఉపసంహరించవలసిన 5వ తేదీ వరకు కొండపిలో టిడిపి పోలీస్ పహారా కాయించి బరిలో నిలిచిన ప్రత్యర్థి అభ్యర్థులపై పోలీస్ అధికారులచే బెదిరింపులకు గురిచేసి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం గావించారని విమర్శించారు. సర్పంచి అభ్యర్ధి గా పోటీ చేసిన యనమద్ది కళ్యాణి భర్త ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుంటే అతన్ని బెదిరించి కళ్యాణిచే బలవంతంగా విత్ డ్రా చేయించారని చెప్పారు. మరో అభ్యర్థి అడ్డగబొట్టు విమలమ్మ కుటుంబంపై పోలీస్ అధికారులు దౌర్జన్యం చేసి భయంతో ఎక్కడో తలదాచుకున్న ఆమెచే బలవంతంగా సంతకం చేయించి విత్ డ్రా చేయించారని ధ్వజమెత్తారు. కాగా తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని నామినేషన్ వేసిన (నిర్ణయించుకున్న)మరో అభ్యర్థి పల్లె మేరి అయిదోతేదీ వరకు తలదాచుకుందామని భావించి వందల కిలోమీటర్లు దూరంలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లిన ఆమెను రప్పించడానికి పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డట్లు విమర్శించారు. ఆమెను రప్పించడానికి ఆమె సమీప బంధువు నెల్లూరు జిల్లా కలిగిరి సీఐ శివన్నారాయణను రప్పించి, నేరస్తుల ఆచూకీ కోసం సెల్ టవర్ ట్రాక్ చేసిన చందంగా మేరి ఆచూకీ కోసం పోలీస్ యంత్రాంగం రాజకీయ పార్టీ కార్యకర్తలుగా వ్యవహరించినట్లు దుయ్య బట్టారు. మేరి హాస్పిటల్‌లో ఉండి, ఆమె విత్ డ్రా చేసుకుంటున్నట్లు ఎవరో వ్యక్తులు ఆమె సంతకం ఫోర్జరీ చేసి విత్ డ్రా చేసినట్లు ప్రకటింప చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థ కు తలవంపులు తెచ్చేదిగా ఉందని వ్యాఖ్యానించారు. మేరి విత్ డ్రా చేయలేదు, ఆమె సంతకం ఫోర్జరీ చేసారని రిటర్నింగ్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేసే ప్రయత్నాన్ని పోలీస్ అధికారులు అడ్డుకున్నారని ఆరోపించారు. కనీసం మీడియా సమావేశం జరుపుకోవడానికి అనుమతి ఇవ్వలేదన్నారు. రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం దరిదాపులకు వైసిపి నాయకులను, కనీసం మీడియాను అనుమతించని పోలీస్ అధికారులు టిడిపి నాయకులను యథేచ్ఛగా అనుమతించడం పట్ల ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ విషయం రిటర్నింగ్ ఆఫీసర్‌తో పాటు డిఎస్‌పి, ఎస్ పి, ఐజి, డిజిపి, జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషనర్, మానవ హక్కుల సంఘంకు మెయిల్ ద్వారా, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కొండపి పంచాయతీ ఎన్నిక నిర్వహించాలని, అవసరం అయితే ఈ ఎన్నిక కోసం న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు. అభ్యర్థి పల్లె మేరి, ఆమె భర్త శివరాం మాట్లాడుతూ 40 ఏళ్ళు గా కాంగ్రెస్ రాజకీయాల పట్ల ఆసక్తితో సర్పంచ్ గా నామినేషన్ వేశానన్నారు. తనను టిడిపి నాయకులు బెదిరిస్తారని భావించి వందల మైళ్ల దూరం లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్తే తన భర్తను, పిల్లలను పోలీసులు బెదిరించినట్లు తెలిపారు. తాను విత్ డ్రా చేయలేదని, ఆ సంతకం తాను చేయలేదని, తాను పోటీలో ఉన్నానని, ఎన్నికలు జరపాలని కోరుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శులు వెంకటాద్రిరెడ్డి, డాకా పిచ్చిరెడ్డి, నాయకులు పిన్నిక శ్రీనివాసరావు, చింతపల్లి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.